ప్రజాశక్తి
గురువారం 25 సెప్టెంబర్ 2025
5
కర్నూలు

84 అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి చర్యలు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జాతీయ రహదారులు, ఆర్అండ్బి, పంచాయతీ రాజ్ రహదారులకు అనుసంధానంగా 84 అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరుగకుండా బ్యారికేడింగ్, రంబుల్ స్ట్రిప్స్, సైన్ బోర్డ్స్ లాంటి ఏర్పాట్లను త్వరితగతిన చేయాలని ఆర్అండ్బి, నేషనల్ హైవే కర్నూలు, అనంతపురం, కడప ప్రాజెక్ట్ డైరెక్టర్లను ఆదేశించారు. పెద్దపాడు నుండి హైదరాబాద్ ఎన్హెచ్కు లింక్ చేస్తూ ఔటర్ రింగ్‌రోడ్ ఏర్పాటు కు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ఆదోని మంత్రాలయం, ఆలూరు తదితర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. అక్కడ ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆర్అండ్బి అధికారులను ఆదేశించారు. కర్నూలు నగరంలో మరో 135 సిసి కెమెరాలను త్వరితగతిన ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. ఆర్అండ్బి ఎస్ఇ మహేశ్వర రెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ, డిటిసి శాంత కుమారి, నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్‌లు, పంచాయతీ రాజ్, ఆర్‌టిసి అధికారులు పాల్గొన్నారు.

జిఎస్‌టి పన్నుల తగ్గింపుపై అవగాహన

జిఎస్‌టి పన్నుల తగ్గింపు పైన అవగాహన, ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేటి నుండి 29 వరకు ఇంటింటికీ జిఎస్‌టి ఫలాలు అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈనెల 30 నుండి అక్టోబర్ 6 వరకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయం , ఇతర వృత్తుల వారికి సంబంధించి రైతు సేవా కేంద్రాల్లో ట్రాక్టర్ ర్యాలీలు, వ్యవసాయ యంత్రాల ప్రదర్శనల ద్వారా తగ్గింపు ధరల గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అక్టోబర్ 7 నుండి 13 వరకు మానవ వనరుల అభివృద్ధి, డిజిటల్ సాధికారతలో భాగంగా పాఠశాలలు, కళాశాలల్లో వ్యాస రచన, పెయింటింగ్, వక్తృత్వపు పోటీలు నిర్వహించాలని, అక్టోబర్ 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు వికాస్ విశ్వాస్ - నమ్మకమైన అభివృద్ధిలో భాగంగా నిర్మాణ సామాగ్రి ప్రదర్శనలు అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 19న నిజమైన దీపావళి ఈ జిఎస్‌టి 2.0 తోనే తుది కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ నీరజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'కూటమి'లో విభేదాలు

- కొన్ని నియోజకవర్గాల్లో టిడిపిలోనే గ్రూపులు
- మరికొన్ని చోట్ల కూటమిలో పొసగని సయోధ్య

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో కూటమిలో విభేదాలు రోజు రోజుకూ పెరుగుతూ ఉన్నాయి. కొన్ని నియోజక వర్గాల్లో టిడిపిలో గ్రూపులు ఉండగా మరికొన్ని చోట్ల కూటమిలోని టిడిపి, బిజెపి, జనసేన మధ్య సయోధ్య పొసగడం లేదు. కర్నూలులో మంత్రి టిజి భరత్ వ్యవహారశైలితో టిడిపిలోని ఇతర ఎమ్మెల్యేలు, నాయకుల్లో వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఆలూరులో టిడిపిలో మరో సారి టిడిపిలో గ్రూపు విభేదాలు బహిర్గతమయ్యాయి. ఆదోనిలో టిడిపి, బిజెపి నాయకుల మధ్య పోరు నడుస్తోంది. ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే పట్ల టిడిపి నాయకుల్లో అసంతృప్తి నెలకొంది. మంత్రాయంలో టిడిపిలోనే రెండు గ్రూపులుగా కార్యక్రమాలు చేస్తున్నారు...

• ఆలూరులో మరోసారి బహిర్గతం

ఆలూరు నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల మధ్య మరోసారి గ్రూపులు విభేదాలు బయటపడ్డాయి. అన్నదాత సుఖీభవపై నిర్వ హించిన విజయోత్సవ ర్యాలీ పార్టీ నాయకుల మధ్య వివాదానికి తెర తీసింది. టిడిపి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పూల నాగరాజు ఆధ్వర్యంలో జరగాల్సిన ట్రాక్టర్ ర్యాలీలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరించారు. ప్రోగ్రామ్ షెడ్యూల్ మేరకు పట్టణ శివారులో ఉన్న హనుమాన్ విగ్రహం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించాల్సి ఉంది.



ఎమ్మెల్సీ బీటీ.నాయుడు, వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ బొజ్జమ్మ, మహిళా నేత వైకుంఠం జ్యోతి ఎదురు చూశారు. అప్పటి టిడిపి ఇన్‌ఛార్జి వీరభద్రగౌడ్, ఆయన గ్రూపు ట్రాక్టర్లతో ర్యాలీగా వచ్చారు. ముందుగా వైకుంఠం జ్యోతి జెండాలు కట్టిన ట్రాక్టర్లలో కూర్చొన్న వారు వీరభద్రగౌడ్‌ను కూడా ట్రాక్టర్‌లోకి ఎక్కాలని ఆహ్వానించారు. వ్యక్తిగత జెండాలు ఉంటే తాను ఎక్కేది లేదని జెండాలు తొలగించాలని వీరభద్రగౌడ్ కోరారు. బీటీ.నాయుడు జెండాలు తొలగించాలని సూచించడంతో జెండాలు తీసేసి ట్రాక్టర్‌పైకి ఎక్కించారు. చివరికి టిడిపి అధిష్టానం వీరభద్రగౌడ్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా తొలగించి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా వైకుంఠం జ్యోతిని నియమించింది.

• ఆదోనిలో బిజెపి వర్సెర్ టిడిపి

గత ఎన్నికల్లో ఆదోని టిడిపి టికెట్ ఆ పార్టీ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు ఆశించారు. పొత్తులో భాగంగా బిజెపికి ఇవ్వాల్సి రావడంతో మీనాక్షినాయుడు టికెట్‌ను త్యాగం చేశారు. బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ పార్థసారథి విజయం సాధించారు. ఎన్నికల వరకు టిడిపి, బిజెపి, జనసేన నాయకులు సమన్వయంతో పని చేసినా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు మధ్య విభేదాలు తలెత్తాయి. విభేదాలు తారస్థాయికి వెళ్లి ఒకరిపై ఒకరు బహిరంగంగానే విమర్శలు చేసుకునే స్థాయికి వెళ్లాయి. టిడిపి కేడర్‌ను ఎమ్మెల్యే పార్థసారథి వ్యూహాత్మంగా అణచివేస్తున్నారని, కనీస ప్రాధాన్యత కూడా ఇవ్వడం లేదంటూ మొదటి నుంచి ఆరోపణలున్నాయి.

• మంత్రాలయంలో వేర్వేరుగా కార్యక్రమాలు

మంత్రాలయం నియోజకవర్గంలో ముందు నుంచి ప్రస్తుత టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, నియోజకర్గ ఇన్‌ఛార్జ్ రాఘవేంద్రరెడ్డి గ్రూపులు ఉన్నాయి. కార్యక్రమాలు కూడా వేర్వేరుగా చేస్తున్న పరిస్థితి ఉంది. గతంలో మధ్యాహ్న భోజన ఏజన్సీ విషయంలో తిక్కారెడ్డి గ్రూపునకు చెందిన విజయరామిరెడ్డి పై రాఘవేంద్రారెడ్డి అనుచరులు దాడి చేశారు. ఇరు గ్రూపులూ ఫిర్యాదులు కూడా చేసుకున్నాయి. ఈ పంచాయితీ అధిష్టానం దృష్టికి కూడా చేరింది.

• మంత్రిపై ఎమ్మెల్యేల అసంతృప్తి

కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా కర్నూలు మండలం రేమట గ్రామానికి చెందిన కురువ సుజాతను నియమించేందుకు ఎంపీ బస్తిపాటి నాగరాజు ప్రయత్నం చేశారు. ఈ నియామకం కోసం ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును కూడా ప్రత్యేకంగా కలిశారు. ఛైర్మన్ పీఠం ఎంపీ ప్రతిపాదించిన మహిళకే దక్కుతుందనే చర్చ కూడా నడిచింది. ఉన్నట్టుండి మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా కర్నూలు నగరానికి చెందిన అజ్మత్‌బీని ఎంపిక చేయడం ఎంపీ వర్గీయుల్లో తీవ్ర అసంతప్తిని రగిలించింది. మంత్రి టిజి.భరత్ సిఫార్సులకే కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసినట్లు తెలిసింది. మార్కెట్ కమిటీ ఛైర్మన్ నియామకం పట్ల పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేను టిజి.భరత్ కలుపుకుని పోలేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఛైర్మన్ ప్రమాణ స్వీకారానికి ఎంపీ, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడం వారి అసంతృప్తికి అద్దం పడుతోంది.

• ఎమ్మిగనూరు టిడిపిలో అసంతృప్తి

ఎమ్మిగనూరులోనూ టిడిపిలో విభేదాలు కొనసాగుతున్నాయి. మున్సిపాలిటీలో మూడు కౌన్సిలర్ స్థానాలను టిడిపి గెలుచుకోగా అందులో కౌన్సిలర్ దయాసాగర్ టిడిపికి రాజీనామా చేసి బిజెపిలో చేరారు. పాత వారిని తక్కువ చేసి చూడటం, పార్టీలో గుర్తింపు ఇవ్వకపోవడంతోనే కొందరు టిడిపి నాయకుల్లో అసంతృప్తి మొదలైనట్లు సమాచారం. ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా కురువ మల్లయ్యను నియమించడం పట్ల కూడా పలువురు టిడిపి సీనియర్ నాయకుల్లో అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది.

స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలి

-కర్నూలు కలెక్టరేట్ ఎదుట డివైఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రకటించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. అంతకు ముందు బిర్లాగేట్ సర్కిల్ నుండి కలెక్టరేట్ వరకు ఉపాధ్యాయ అభ్యర్థులతో ర్యాలీ చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన ధర్నాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ జిఒ నెంబర్ 13 ప్రకారం ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులు 2,260 తక్షణమే సిలబస్ ప్రకటించి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న 86,000 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు స్పెషల్ ఎడ్యుకేషన్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో భర్తీ చేసి వారి శక్తి, సామర్థ్యాలను సమాజం కోసం వినియోగించుకోవాలని కోరారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం 2025 జులై 15లోపు స్పెషల్ ఎడ్యుకేషన్ డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని చెప్పిందని గుర్తు చేశారు. 20 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్ బిఇడి, డిఇడి చేసిన నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. అసెంబ్లీ సమావేశం లో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పెషల్ డిఎస్‌సి విడుదల చేస్తూ ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు . లేకపోతే రాబోయే రోజుల్లో ఈ ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప మద్దతు తెలిపారు. డివైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్ బాష, నాయకులు విక్రం నిరుద్యోగులు లోకేష్, నారాయణ, రమణమ్మ, మధు, శీను పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న

ప్రయివేటు సంస్థల మోసాలను అరికట్టాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రవాణా రంగంలో ప్రైవేటు సంస్థలు ఓలా, రాపిడో, ఊబర్ లాంటి సంస్థలను అరికట్టాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ సంస్థలు యాపుల పేరుతో రవాణా రంగంలోని ఆటో డ్రైవర్లకు తక్కువ కమిషన్లు ఇస్తూ మోసగిస్తున్నాయన్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ఎపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అధ్యక్షులు ఎస్.హుస్సేన్ వలి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో ఎండి అంజిబాబు , సిఐటియు న్యూ సిటీ అధ్యక్షుడు నగేష్, ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె. ప్రభాకర్ న్యూ సిటీ కార్యదర్శి రాధాకృష్ణ లు మాట్లాడారు. ఓలా, ఊబర్, రాపిడో పేరుతో రవాణా రంగంలోకి చొరపడ్డాయన్నారు. తక్కువ కమీషన్‌తో ఆటో డ్రైవర్లను మచ్చిక చేసుకున్నాయన్నారు. తక్కువ కమీషన్లతో రైడ్ ఇస్తామని ఆటో డ్రైవర్లను నమ్మించి ప్రైవేటు సంస్థలు మోసగిస్తున్నాయన్నారు. ఆ యాప్‌లకు అలవాటు పడిన ఆటో డ్రైవర్ల బలహీనతను సొమ్ము చేసుకున్న కంపెనీలు ఇప్పుడు అమాంతంగా ఇష్టమొచ్చినట్లు కమీషన్లు పెంచుతున్నా యన్నారు. ఈ యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో ఆటో డ్రైవర్లకు ప్రత్యేకమైన యాప్‌ను ప్రభుత్వం తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ నగర నాయకులు పెద్ద మాలిక్ బాషా, ఎస్.శంషీర్‌బాష, మల్లి, శ్రీను, రాజశేఖర్, సురేష్, శివకృష్ణ, నాగేంద్ర, మౌలాలి, మహబూబ్ బాషా, అయస్వామి, ఖాదర్ పాల్గొన్నారు.

ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

సిఎం అభినందన సభకు డిఎస్‌సి అభ్యర్థులు

-బస్సులను జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2805 మంది అభ్యర్థులు డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపిక కావడంతో గురువారం రాజధానిలో తలపెట్టిన ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు అభినందన సభకు ప్రత్యేక బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. బుధవారం రాయలసీమ వర్సిటీ ప్రాంగణంలో ఈ బస్సులను కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి జెండా ఊపి ప్రారంభించారు. 123 బస్సుల ద్వారా డిఎస్‌సి ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులతో పాటు ఇతర కుటుంబ సభ్యుల ను కూడా తరలి వెళ్లారు. డిఇఒ శామ్యూల్ పాల్, నంద్యాల డిఇఒ, డిప్యూటీ డిఇఒలు ఎంఇఒలు తదితరులు పాల్గొన్నారు. కొత్త సంస్కృతికి కూటమి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి దగ్గరకు పిలిచి అధినందన పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు దర్శనం చేయిస్తున్నారు.

ప్రత్యేక బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ సిరి

టమోటా నేలపాలు

కిలో రూ.2 డిపోయిన టమోటా

ప్రజాశక్తి-పత్తికొండ

గత రెండు రోజుల నుండి టమోటా ధర రోజురోజుకు పతనం కావడంతో టమోటా పంటను నేలపై పారబోస్తూ రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. బుధవారం వ్యవసాయ మార్కెట్‌లోని టమోటా వ్యాపారస్తులు సిండికేట్ కావడంతో కిలో రూ 2నుంచి రూ.3 కొనుగోలు చేయడం తో రైతులు గగ్గోలు పెడుతున్నారు. వ్యాపారులు వర్షం కారణం , నాణ్యత పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నా మమ్మల్ని పట్టించుకునే వారు లేరంటున్నారు టమోటా రైతులు. సాగుచేసిన పెట్టుబడి రాకపోయినా పరవాలేదు కనీసం రవాణా చార్జీలు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారస్తులు మా జీవితాలతో చలగాటమాడుతున్నారంటూ కొందరు రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా మార్కెట్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి టమోటాలు కొనుగోలు చేయాలన్నారు.



అదనపు కమిషనర్‌కు వినతి ఇస్తున్న నాయకులు

రోడ్డు సైడ్ చిన్న వ్యాపారులపై వేధింపులు ఆపాలి

అదనపు కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : చిన్న వ్యాపారస్తులపై కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ వారి వేధింపులను ఆపాలని సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు డి.అబ్దుల్ దేశాయ్, ఎం.విజయ రామాంజనేయులు, సిఐటియు నగర నాయకులు మహమూద్, కుమార్, సాల్మన్ రాజు, ఎస్ఎండి షరీఫ్‌లు చిన్న వ్యాపారస్తులను కలుపుకొని అదనపు కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. కర్నూలు నగరంలో రోడ్డు కిరువైపులా ఫుట్‌పాత్‌లపై, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా, ప్రజలకు సరసమైన, అతి తక్కువ ధరలతో అందుబాటులో ప్రజలకు రెడీమేడ్ దుస్తులు ,బట్టలు బ్యాగులు, టోపీలు, బెల్టులు, కుట్టు మిషన్లు, తిను బండారాలు ,టిఫిన్లు వివిధ రకాల వస్తువులను అమ్ముతూ తమ జీవనోపాధి చేసుకుంటున్నారని కమిషనర్‌కు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ కర్నూలు నగరంలో ఎటువంటి పరిశ్రమలు లేకపోవడంతో ఉపాధి లేక ఫుట్‌పాత్‌లనే ఆధారంగా చేసుకొని కొన్ని ఏళ్లుగా స్వయం కృషితో ,తమ కాళ్లపై తాము జీవిస్తూ, తమ భార్య, పిల్లలను పోషించుకుంటున్నారు. సొంత ఇల్లు లేక ,బాడుగలు చెల్లించలేక, కరెంటు బిల్లులు కట్టలేక నానా కష్టాలు పడి ఇష్టం లేకపోయినా కష్టంతో జీవిస్తున్న వారిపై వేధింపులు చేయడం సరైనది కాదని వారన్నారు. నిరుపేద చిన్న వ్యాపారస్తులైన వారిపై మున్సిపల్ కార్పొరేషన్ వారు నగర సుందరీకరణ పేరుతో ,అమృత సిటీ పేరుతో షాపులను, అంగళ్లను తొలగిస్తామని, హెచ్చరికలు జారీ చేశారన్నారు. ఇది సరైన పద్ధతి కాదని వారికి ప్రత్యామ్నాయం చూపకుండా, షాపులు తొలగిస్తామంటే సిఐటియుగా ఒప్పుకునేది లేదన్నారు.రోడ్డు సైడ్ చిన్న వ్యాపారస్తుల సంఘం నగర కార్యదర్శి శివ ప్రసాద్, సహాయ కార్యదర్శి జి. నరసింహులు ,ఇక్బాల్ ఇంతియాజ్, బాబు, శేష పని నగర ఉపాధ్యక్షులు గోరభాయ్, హమీద్, మన్సూర్ హుస్సేన్, నాగరాజు శ్రీనివాసులు, శశ , షఫీ, రజనీకాంత్రెడ్డి పగిడలయ్య, హాజీ బాషా, ప్రభుదాస్ గఫార్‌బాష, ముక్తియార్, గులాబ్, సాబేర్ బాష తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిల వైద్యులు సమ్మెకు సన్నద్ధం

కలెక్టర్‌కు సమ్మె నోటీసు, సమస్యల వినతి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఎపిపిహెచ్‌సిడిఎ) తరపున బుధవారం జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి సమ్మె నోటీసును డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రం యిచ్చారు. వారు మాట్లాడుతూ మా ప్రధాన డిమాండ్లు ఇన్-సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలని, టైమ్-బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పే 50శాతం ట్రైబల్ అలవెన్స్ మంజూరు, నోషనల్ ఇన్‌క్రిమెంట్స్ మంజూరు, చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రామ్ కింద వైద్యులకు రూ.5000 అలవెన్స్, నేటివిటీ అండ్ అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యల పరిష్కారించాలని అన్నారు. తక్షణమే పరిష్కరించాల్సిన సమస్యలు పిహెచ్‌సి వైద్యులకు ఖచ్చితమైన పని గంటలు, స్థిరమైన వారాంతపు సెలవు ఇవ్వాలన్నారు. వైద్యుల జాబ్ చార్ట్ ప్రకటించాలని, విషపూరితమైన (టాక్సిక్) పని వాతావరణాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనధికారిక వ్యక్తులు (ఉదా: నాన్ మెడికల్, శాఖ కు సంబంధం లేనివారు) పిహెచ్‌సిలను విచ్చలవిడిగా ఇన్‌స్పెక్ట్ చేయకుండా స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలన్నారు. తగినంత స్టాఫ్ నర్సులు లేకపోయినా పిహెచ్‌సిలను తాము నడిపిస్తున్న కఠిన పరిస్థితులను ప్రభుత్వం గమనించాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లు ఎన్నిసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు పరిష్కారం కాలేదన్నారు. దీంతో మేము నిరసనకు దిగక తప్పని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రజలందరూ మా నిరసన ప్రజలపై కాదని, ప్రభుత్వ నిర్లక్ష్యంపై మాత్రమే అని గమనించాలని తెలిపారు. కరోనా వంటి అత్యవసర పరిస్థితుల్లో కూడా మేము ప్రజాసేవలో వెనుకడుగు వేయలేదన్నారు. అయినప్పటికీ, మా న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం మరుగునపరుస్తూనే ఉందన్నారు.అందువల్ల, ఇక మాకు మిగిలింది సమ్మె ద్వారానే మా గళం వినిపిస్తామన్నారు. తక్షణమే చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించకపోతే, ఈ గురువారం సమ్మె కార్యాచరణ ప్రకటించి నిరవధిక సమ్మెకు దిగుతామని తెలిపారు. వైద్య సేవల్లో అంతరాయం కలగడంపై పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే అవుతుందని వారు హెచ్చరించారు.

కలెక్టర్‌కు సమ్మె నోటీసు, సమస్యల వినతి ఇస్తున్న పిహెచ్‌సి వైద్యులు

మాట్లాడుతున్న రాయలసీమ విసి వి.వెంకటబసవరావు

సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలని వైస్ ఛాన్సలర్ వి. వెంకట బసవరావు పిలుపునిచ్చారు. జాతీయ సేవాపథక దినోత్సవాన్ని రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో నిర్వహించారు. విసి మాట్లాడుతూ వాయుకాలుష్య నివారణ, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలన, వినియోగాన్ని తగ్గించుట, సమర్థవంతమైన నిర్వహణల గురించి వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేయాలన్నారు. వాయుకాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాల గురించి అవగాహనాకార్యక్రమాన్ని రాయలసీమ యూనివర్సిటీలో నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా పాండిచ్చేరి కేంద్ర విశ్వవిద్యాలయంనుండి వచ్చిన ఎస్. పన్నీర్ సెల్వం, ఎస్.దినేష్‌లను వైస్‌ఛాన్సలర్ అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టికె. నాయక్ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్ కుమార్ నాయుడు, ప్రిన్సిపల్ ఆచార్య సివి.కృష్ణారెడ్డి, ఎన్ఎస్ ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

విసి పిఎస్‌షా వలీ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సేవా పర్వ్ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని ఇంచార్జి వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ పిఎస్‌షా వలీ ఖాన్ విద్యార్థులను కోరారు. బుధవారం కర్నూలు నగరంలోని ఉర్దూ యూనివర్సిటీలో 'సేవా పర్వ్' కార్యక్రమాన్ని ఎన్ఎస్-ఎస్.యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఇంచార్జి వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ పిఎస్. షావలీ ఖాన్ మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుండి అక్టోబర్ 2 వరకు సేవా పర్వ్ కార్యక్రమాన్ని జరుగుతుందన్నారు. వాయు కాలుష్యం , ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనే సేవా పర్వ్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వ్యాస రచన , చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో , రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. లోకనాథ, పుదుచెర్రీ కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యులు పరమేశ్వర పన్నీర్ సెల్వంఇంచార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మహబూబ్‌బాషా, ఎన్ఎస్ఎస్.వాలంటీర్లు, విద్యార్థులు, సేవా పర్వ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కెవిఆర్ కళాశాలలో : కెవిఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం జాతీయ సేవా పథకం దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకట్ రెడ్డి గమాట్లాడుతూ సమాజం పట్ల మన బాధ్యతని గుర్తుచేశారు. యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎ.జయలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కళాశాల లో : కర్నూలు, బి-క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవవేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.ఎల్లాకృష్ణ మాట్లాడారు. కళాశాల లెక్చరర్స్ విజయశేఖర్ , మల్లికార్జున, సోమేష్, ఉల్లోజిరావు , చిన్న మల్లేశ్వరుడు , బాల శంకర్, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఒకేషనల్ కళాశాలలో మాట్లాడుతున్న డాక్టర్ జి.ఎల్లాకృష్ణ

శ్రీశంకరాస్ డిగ్రీకాలేజీలో : కర్నూలు నగరంలో గాయత్రి ఎస్టేట్ కూడలి వద్ద ఉన్న శ్రీ శంకరాస్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్‌డేను ఘనంగా నిర్వహించారు. ఇన్చార్జి ప్రిన్సిపల్ అండ్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మద్దిలేటి మాట్లాడుతూ విద్యార్థులు సేవా గుణాన్ని అలవర్చుకొని సమాజానికి మార్గదర్శకులు కావాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ముఖిత్, తెలుగు అధ్యాపకులు మద్దయ్య , ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మైపర్ లో ఘనంగా జాతీయ ఎన్ఎస్ఎస్ డే

కర్నూలు నగరంలోని ఎ.క్యాంపులోని మైపర్ ఫార్మసి కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే వేడుకలను నిర్వహించారు. విద్యార్థులకు వివిధ సర్వీసుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఏ క్యాంపులో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం మొత్తం మైపర్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న విసి పిఎస్‌షా వలీ ఖాన్

విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ప్రాధాన్యతను వివరించారు. సర్టిఫికెట్లు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రాజ్ కుమార్, భాస్కర్ , ప్రశాంత్, హరి నాయక్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీశంకరాస్‌లో , మైపర్ కాలేజీలో

రైతుల్లేకుండా భూసేకరణపై సమావేశమా..?

- జెసి తీరుపై రైతు సంఘం ఆగ్రహం...

ప్రజాశక్తి-ఆస్పరి

సమావేశంలో మాట్లాడుతున్న జెసి నవ్య

ఆలూరు మండలం మనేకుర్తి గ్రామ రెవెన్యూ పరిధిలో పవర్ గ్రిడ్ కోసం రెవెన్యూ అధికారులు నిర్వహించిన భూసేకరణపై రైతు సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. భూమి కోల్పోయే బాధిత రైతులు లేకుండా సమావేశం నిర్వహించడం విచారకరమని రైతు సంఘం జిల్లా నాయకులు హనుమంతు, భూపేష్ విమర్శించారు. బుధవారం ఆలూరు ఎంపిడిఒ కార్యాలయంలో జెసి నవ్య పవర్ గ్రిడ్ భూసేకరణ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భూమి కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.18 లక్షలు ఇస్తున్నామని, జనరల్ ఎక్విటీ కింద కోర్టు ద్వారా రూ.6 లక్షలు ఇస్తామని, రైతులు సహకరించాలని కోరారు. రైతులు మొండికేస్తే బలవంతంగా భూసేకరణ చేయాల్సి వస్తుందన్నారు. రైతు సంఘం నాయకులు హనుమంతు మాట్లాడుతూ.. రైతులు సారవంతమైన భూములను ఇవ్వలేని లేదని తెగేసి చెబుతున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం తగదన్నారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. తహశీల్దార్ శ్రీ సువర్ణ, డిటి విజయకుమార్, పవర్ గ్రిడ్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యల వలయంగా 'పేట'

- పట్టని పాలకులు, అధికారులు - ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్
- రోడ్డుపై మొక్కలు నాటి నిరసన తెలిపిన ప్రజలు
- రూ.3.40 లక్షలు చెల్లిస్తే ట్రాన్స్‌ఫార్మర్ తరలిస్తాం : అధికారుల వాదన

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని పేట గ్రామం సమస్యల వలయంగా మారింది. గ్రామంలో ఎటు చూసినా సమస్యలే కనిపిస్తున్నాయి. చాలా వీధుల్లో రోడ్లు, డ్రైనేజీ లేక ఇళ్ల మధ్య నీరు నిలిచింది. పేట గ్రామం నుంచి నాగలదిన్నె, కనకవీడు, నందవరం, ఎమ్మిగనూరుకు వెళ్లే ప్రధాన రహదారి దుర్గంధంగా తయారయింది. ఈ రహదారిపై నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రయాణంలో విద్యార్థులు, వృద్ధులు, గర్భిణులు చాలా అవస్థలు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరు నిలిచి రోడ్డు పూర్తిగా ధ్వంసమయింది. నడవడానికి కూడా వీల్లేని విధంగా బురద, నీరు నిల్వ ఉంటోంది. రోడ్డు దుర్భరంగా ఉన్నా పాలకులు, అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. సర్పంచి భర్తకు ప్రజలు పలుమార్లు విన్నవించినా స్పందించడం లేదు. ఎన్నికల సమయంలోనూ ఎమ్మెల్యే బీవీ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మరిచారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని రోడ్డుపై నిలిచిన నీటిలో మొక్కలు నాటి ప్రజలు నిరసన చేపట్టారు.

రోడ్లపై నిలిచిన నీటిలో మొక్కలు నాటుతున్న ప్రజలు

విజృంభిస్తున్న విషజ్వరాలు

- ఈరన్న, గ్రామస్తుడు

గ్రామంలో ఉన్న కలుషితమైన వాతావరణం వల్ల ప్రజ లకు విషజ్వరాలు సంభవిస్తున్నాయి. సుమారు 8 ఏళ్లుగా ఈ దుర్భరమైన వాతావరణంలోనే జీవనం సాగిస్తున్నాం. దోమల సంచారం వల్ల మలేరియా, డెంగీ వంటి రోగాల బారిన పడుతున్నాం. గ్రామ సమస్యలను అధికారులు, పాలకులు పట్టించకపోవడం బాధాకరం.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- వెంకటేష్, గ్రామస్తుడు

గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డులో ప్రమాదకరంగా ఉంది. అటువైపు ఆటోలు, బొలెరో వాహనాలు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. రెండేళ్ల క్రితం ట్రాన్స్‌ఫార్మర్‌ను తగిలి ఆవు చనిపోయింది. దాని చుట్టూ కనీస భద్రత వ్యవస్థను కూడా అధికారులు ఏర్పాటు చేయడం లేదు. గతంలో ఆ ట్రాన్స్‌ఫార్మర్ ఊరి చివర్లో ఉండేది. ఊరు పెరగడం వల్ల అది మధ్యలోకి వచ్చిందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. 'మాకు సంబంధం లేదు. దానికయ్యే ఖర్చు మీరే భరించాలని విద్యుత్ అధికారులు అనడం బాధాకరం. 'మీరైనా కట్టండి. ఎమ్మెల్యే ద్వారా అయిన కట్టించండి' అని అంటున్నారు. గతంలో రెండు నెలలకు కలిపి విద్యుత్ చార్జీలు రూ.50 కట్టే వాళ్లం. ఇప్పుడు నెలకు రూ.500కు పైగానే చెల్లిస్తున్నాం. విద్యుత్ అధికారులు అప్పుడున్న రేటు ప్రకారమే విద్యుత్ చార్జీలు వసూలు చేయొచ్చు కదా.. విద్యుత్ చార్జీలయితే విచ్చలవిడిగా పెంచారు. సమస్య అయితే మాకు సంబంధం లేదనడం పద్ధతి కాదు.

రూ.3.40 లక్షలు చెల్లిస్తే ట్రాన్స్‌ఫార్మర్ తరలిస్తాం

- విద్యుత్ అధికారులు

రూ.3.40 లక్షలు ఎస్టిమేషన్ ఖర్చు అవుతుంది. దానిని చెల్లిస్తే ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే ప్రదేశానికి తరలిస్తాం. సమస్యను పరిష్కరించడానికి విద్యుత్ శాఖ ఆర్థిక భారాన్ని అంగీకరించదు. ఆ భారం ప్రజలు భరించాల్సిందే.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం

- పంచాయతీ కార్యదర్శి సోమశేఖర్

గ్రామ పాలకుల సహాయంతో సమస్యను గతంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. మరోసారి గ్రామ పరిస్థితులను ఆయనకు వివరించి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తాం.

బీవీ స్మారక క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - గోనెగండ్ల

సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మాజీమంత్రి కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి స్మారక జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథులుగా ఎమ్మిగనూరుకు చెందిన వ్యాపారవేత్త, టిడిపి నాయకులు బి.చంద్రశేఖర్ ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ కురువ మల్లయ్య, హెచ్.కైరవాడి సొసైటీ ప్రెసిడెంట్ తిమ్మారెడ్డి, టిడిపి మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడారు. క్రీడలు యువతలో మానసిక వికాసాన్ని పెంపొందించి శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని, స్నేహపూర్వక సంబంధాలను మెరుగుపరుస్తాయని తెలిపారు. గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. నిర్వాహకులు ఐరన్‌బండ బాష, అలువాల బాష, టౌన్ ప్రెసిడెంట్ మహల్ రహమతుల్లా, నజీర్ సాహెబ్, కున్నూరు రమణ, కాంట్రాక్టర్ షేక్షావలీ, పూజారి చంద్రశేఖర్, గౌవుండా రహమతుల్లా, శ్రీధర్ నాయుడు, మదీన, అచ్చుగట్ల ఫక్రుద్దీన్, మిన్నెల్లా, నాగన్న, రమేష్, రాంపురం రఫీక్, జైపాల్, నాయుడు, రవితేజ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాధవరావు దేశాయ్

ప్రజాశక్తి - నందవరం

దుస్తులు పంపిణీ చేస్తున్న మాధవరావు దేశాయ్

గ్రామంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాధవరావు దేశాయ్ తెలిపారు. బుధవారం ఆయన శ్రేయోభిలాషులు, అభిమానులు, కార్యకర్తలు, ప్రజలకు 500 మందికి దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దసరా పండగకు గ్రామంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉందని తెలిపారు. పండగ రోజు గ్రామంలోని ప్రజలందరూ ఉత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. చాకలి వెంకటేష్, తెలుగు ఈరన్న, చాకలి శీను, డీలర్ మల్లికార్జున, నజీర్, వడ్డేగేరి నరసింహులు, వలీ, చాకలి పంపయ్య, చాంద్ బాషా పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని వినియోగంచుకోండి : వైసిపి

ప్రజాశక్తి - మంత్రాలయం

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కర్నూలులోని సుశీల నేత్రాలయ వారి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైసిపి జిల్లా కార్యదర్శి మురళీ మోహన్ రెడ్డి, నియోజకవర్గ డాక్టర్ల విభాగం అధ్యక్షులు దశరథ రెడ్డి కోరారు. బుధవారం ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి ఆదేశాల మేరకు తుంగభద్ర సేవా సమితి ఆధ్వర్యంలో తుంగభద్ర గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రారంభోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లాలోనే పేరు పొందిన సుశీల నేత్రాలయ వారిచే వైద్య పరీక్షలు చేసి, ఆరోగ్యశ్రీ, ఇసిహెచ్ ద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్లు చేపట్టడం భీమా యూత్, తుంగభద్ర సేవా సమితి సభ్యుల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.

ఘనంగా భూపాల్ చౌదరి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తనయుడు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొంక భూపాల్ చౌదరి పుట్టినరోజు వేడుకలను టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. బుధవారం టిడిపి నాయకులు మారుతి నాయుడు కార్యాలయ ఆవరణలో పూలమాల శాలువాలు కప్పి భారీ కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా భూపాల్ చౌదరి మాట్లాడారు. నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తామన్నారు. టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు సారథ్యంలో క్షేత్రస్థాయిలో పర్యటించి కేడర్‌లో జోష్ నింపుతామని తెలిపారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప, టిడిపి పట్టణ అధ్యక్షులు తిమ్మప్ప, మండల అధ్యక్షులు శివప్ప, సీనియర్ నాయకులు ముజీబ్ అహ్మద్, లక్ష్మీనారాయణ, అంజి, చిట్టి రాజు, శంకర్, రామస్వామి, వెంకటేష్ చౌదరి, మారుతి నాయుడు, సుబ్బు, నారాయణ పాల్గొన్నారు.

భూపాల్ చౌదరిని సన్మానిస్తున్న నాయకులు

అన్ని వ్యాధులకూ వైద్యం

- డాక్టర్ రత్నాకర్

ప్రజాశక్తి - ఆదోని

అన్ని వ్యాధులకూ వైద్యం అందుబాటులో ఉందని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని హోమియోపతి డాక్టర్ ఎ.రత్నాకర్ తెలిపారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రోడ్డులో ప్లానర్ రమేష్ ఆధ్వర్యంలో బుధవారం కళాశాల న్యూ కాంప్లెక్స్‌లో 'వైటల్ వెల్ హోమియోపతి క్లినిక్ స్టోర్స్‌ను వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రత్నాకర్ మాట్లాడారు. మానవ మనుగడ సజావుగా సాగాలంటే మంచి ఆరోగ్యం అవసరమన్నారు. రోజువారీ సమస్యలైన గ్యాస్ ట్రబుల్, దగ్గు, జలుబు, తలనొప్పి (మైగ్రేన్), మహిళ, పిల్లల సమస్యలు, జీవనశైలి వ్యాధులు, ఉబ్బసం, థైరాయిడ్, కీళ్ల సమస్యలు, వెన్నునొప్పి, మలబద్ధకం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి తదితర సమస్యలపై చికిత్సలు లభిస్తాయన్నారు. సామాజిక సేవకులు కట్టా స్వామి దాస్, పాస్టర్‌లు భారత్, ఆంథోని, జర్నలిస్టులు దేవదాస్, మునెప్ప, రఘు, బీఎస్పీ జిల్లా మాజీ అధ్యక్షులు శాంతకుమార్ ఉన్నారు.

నాయకుని సన్మానిస్తున్న డాక్టర్ రత్నాకర్

బైక్ అదుపు తప్పి మహిళ మృతి

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్వి నడుమ వంక దగ్గర బైక్ అదుపు తప్పి కిందపడగా మహిళ మృతి చెందారు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. హాలహర్వి గ్రామానికి బింగి లక్ష్మి (60), ఆమె అల్లుడు మల్లికార్జునలు బుధవారం పొలానికి బైక్‌పై బయల్దేరారు. నడుమ వంక వద్ద బైక్ అదుపుతప్పి కింద పడింది. ఈ ఘటనలో బింగి లక్ష్మి మృతి చెందారు. మల్లికార్జునకు గాయాలయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బళ్లారికి తరలించారు.

పల్లె రహదారులు బురదమయం

- ఈ రోడ్లపై ప్రయాణమంటేనే హడలిపోతున్న ప్రజలు
- ఏళ్లుగా తప్పని అవస్థలు...

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని గ్రామీణ రహదారుల పరిస్థితి చాలా అధ్వానంగా మారింది. వాటిపై ప్రయాణమంటే ప్రజలు హడలి పోతున్నారు. మండలంలో చాలా వరకు గ్రామీణ రహదారులు ఛిద్రమయ్యాయి. వీటికితోడు చాలా గ్రామాల్లో రహదారులపై గుంతలు ఏర్పడడంతో వర్షం కురిసిన సమయాల్లో వర్షపు నీటితో నిండిపోతున్నాయి. ఏది గుంతో.. ఏది రోడ్డో తెలియక చాలామంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇది రాత్రి సమయాల్లో మరీ ఘోరంగా ఉంటోంది. ఆయా రహదారుల గుండా ప్రజలు రాకపోకలు సాగించడ మంటే సాహస మనే చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా విద్యార్థులు, కూలీలు, కార్మికులు ఛిద్రమైన రహదారులతో రాకపోకలు సాగించాలంటే తీవ్రంగా ఇబ్బంది పడుతున్నా రు. మండలంలోని చింతకుంట నుంచి సిరగపురం రోడ్డు, గూళ్యం నుంచి బల్లూరు రోడ్డు, హాలహర్వి నుంచి మాచ నూరు, చింతకుంట నుంచి చాగిబండ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి.

ఏళ్లుగా తప్పని అవస్థలు...

గ్రామీణ రహదారులు చాలా వరకు దెబ్బతిన్నా ప్రభుత్వం మరమ్మతులు చేపట్టడం లేదు. అధికార యంత్రాంగం కూడా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. ప్రతి ఏడాది అధికారులు కేవలం ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నారే కానీ.. నిధులు మాత్రం మంజూరు చేయలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో గ్రామీణ రహదారులు పూర్తిగా అధ్వానంగా మారింది. కనీసం గుంతలు కూడా పూడ్చలేని దుస్థితిలో ప్రభుత్వం ఉండడం విమర్శలకు తావిస్తోంది. ఏళ్లుగా రహదారులకు మరమ్మతులు చేయకపోవడంతో మండలంలో కొన్ని గ్రామాల్లో ప్రజలు, యువతే స్వచ్ఛందంగా గుంతలు పూడ్చి రహదారులను బాగు చేసుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వంలో మాత్రం చలనం రావడం లేదు.

బురదమయమైన సిరగపురం రహదారి

అంబులెన్స్ రావడానికి ఇబ్బందే

- రాజశేఖర్, సిరగపురం గ్రామస్తుడు

మా గ్రామానికి దాదాపు 78 ఏళ్లుగా రోడ్డు నిర్మించలేదు. రోడ్డు లేక, బస్సులు లేక ప్రమాదాలు జరిగితే అంబులెన్స్ రావడానికి కూడా ఇబ్బందికరంగా రోడ్లు ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి రోడ్డు వేయాలి.

ప్రతిపాదనలు పంపాం

- సోమప్ప, పంచాయతీ ఎఇ

మండలంలోని అన్ని గ్రామాల రోడ్లకు ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే రోడ్లు నిర్మిస్తాం.

ఇబ్బందులకు గురి చేయడం తగదు

- అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ

ప్రజాశక్తి - ఆదోని

అంగన్వాడీ టీచర్లను మానసిక ఇబ్బందులకు గురి చేసే ధోరణికి అధికారులు స్వస్తి చెప్పకపోతే చూస్తూ ఊరుకోమని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ తెలిపారు. బుధవారం ఆదోనిలోని సిఐటియు కార్యాలయంలో అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షులు వరలక్ష్మీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.వెంకటమ్మ, సిఐటియు నాయకులు తిప్పన్న, బి.వీరారెడ్డి, సెక్టార్ కార్యదర్శి సోమక్క మాట్లాడారు. అంగన్వాడీలు మాట వినడం లేదన్న కారణంగా అధికారి పత్రికలకు సమాచారమిచ్చి అసత్యాలు రాయించడం సమంజసం కాదన్నారు. ఏదైనా సమస్య ఉంటే మాట్లాడి సరి చేయాల్సిన వారే కార్యకలాపాలను లీక్ చేయడం మానుకోవాలని హితవు పలికారు. అంగన్వాడి కార్యకర్త తన కుమారునికి ఆరోగ్యం బాగాలేక భావన చిన్నపిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లారని, కుమారుని పుట్టినరోజు ఉండడం వల్ల షాపింగ్ మాల్‌లో బట్టలు కొనుగోలు చేశారని తెలిపారు. ఈ విషయం కూడా రాయించడం తగదన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూడాలని, ఉన్నతాధికారులు కూడా కిందిస్థాయి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసి వారిని భయభ్రాంతులకు గురి చేయడం సరైనది కాదని తెలిపారు. వివరణ లేకుండా వార్త ప్రచురించిన ఆ విలేకరి విజ్ఞతకే వదిలేస్తున్నామని స్పష్టం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటమ్మ

గోనెగండ్లలో డెంగీ కేసు నమోదు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ద్రావణం పిచికారి చేయిస్తున్న కృష్ణుడు

గోనెగండ్ల మేజర్ పంచాయతీలోని సచివాలయం-2 పరిధిలో డెంగీ కేసు నమోదయినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి కృష్ణుడు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బందితో కలిసి కేసు నమోదైన ఇంటి పరిసరాల్లో ద్రావణాన్ని పిచికారి చేయించారు. గ్రామస్తులు ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సతీష్, ఎంపిహెచ్ఇఒ హనుమంతు, ఎంపిహెచ్ఎస్ పరమేష్, ఎంపిహెచ్ఎ బలరాం, సిబ్బంది ఉష, ప్రమీల, స్రవంతి పాల్గొన్నారు.

రాజ్మా, సోయాబీన్స్ అలంకారంలో అవ్వ

ప్రజాశక్తి - ఆదోని రూరల్

దసరా నవరాత్రుల సందర్భంగా ఆదోని శ్రీమహాయోగి లక్ష్మమ్మ అవ్వను బుధవారం మూడో రోజు రాజ్మా, సోయాబీన్స్‌లతో అలంకరించారు. నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు, ప్రజలు అవ్వను దర్శించుకోవాలని ఆలయ ధర్మకర్త రాయచోటి రామయ్య కోరారు. **మంత్రాలయంలో** శ్రీ వాసవి మాత అన్నపూర్ణ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవాసవి కల్యాణ మండపంలో అమ్మవారికి పురోహితులు గౌతమాచార్ ఆధ్వర్యంలో వేద మంత్రాలతో హోమం నిర్వహించారు. **ఆస్పరి** సమీపంలోని రామతీర్థం కొండల్లో వెలసిన శ్రీగాయత్రి మాత అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు రూపా మోహన్ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆకు పూజ, బిల్వార్చన, కుంకుమార్చన, హోమం, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున రావడంతో ఆలయం ప్రాంగణం కిటకిటలాడింది.

శ్రీభవానీ యూత్‌కు ప్రదీప్ రెడ్డి విరాళం

ప్రజాశక్తి - మంత్రాలయం

అమ్మవారిని దర్శించుకున్న ప్రదీప్‌రెడ్డి

దేవీ నవరాత్రుల సందర్భంగా శ్రీభవానీ యూత్ ఆధ్వర్యంలో కొలువైన దుర్గామాతను వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి దర్శించుకొని రూ.20 వేలు విరాళంగా అందించారు. బుధవారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలోని ప్రధాన రహదారిపై కొలువుదీరిన దుర్గా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. ఆయనకు శ్రీభవానీ యూత్ సభ్యులు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. దుర్గా దేవి విగ్రహం ఏర్పాటు చేసిన శ్రీభవానీ యూత్‌కు రూ.20 వేలు, తాయమ్మ ఆలయ పూజారులకు రూ.5 వేల నగదును అందజేశారు. సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, నాయకులు గోరుకల్లు కృష్ణ స్వామి, కురువ మల్లికార్జున, శివకుమార్, జనార్ధన్ రెడ్డి, వికెసి రాఘవేంద్ర, వీరారెడ్డి, బాలరాజు, రామాంజి, గాలెప్ప, మారెప్ప, వీరేష్, భీమ, సుంకన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.

'బంద్‌తో అధ్యాపకుల ఇబ్బందులు'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రవ్యాప్తంగా ప్రయివేట్ డిగ్రీ కళాశాలల బంద్ కొనసాగడం ద్వారా డిగ్రీ కళాశాలలో పనిచేసే అధ్యాపకుల కుటుంబాలు ఇబ్బంది పడుతున్నట్లు ప్రయివేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా తెలిపారు. బుధవారం ఎమ్మిగనూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట పట్టణంలోని అన్ని డిగ్రీ కళాశాలల అధ్యాపకులు యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ డిగ్రీ కళాశాలల్లో బంద్ వల్ల అధ్యాపకుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, విద్యార్థులు విద్యకు దూరమై విలువైన భవిష్యత్తును కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. ప్రయివేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలతో చర్చించి సమస్యను పరిష్కరించాలని కోరారు. జిల్లా కార్యదర్శి సిద్ధరాముడు, ఆఫ్జల్, రాజశేఖర్, పాలరాజ్, ఇర్ఫాన్, ధనుంజయ, స్రవంతి, లక్ష్మి, అర్చన పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

- మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది

ప్రజాశక్తి - హోళగుంద

మాల మారన్న మృతికి కారణమైన విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు గుడిసె మహానంది డిమాండ్ చేశారు. బుధశారం హోళగుందలోని గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఈనెల 22న విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో మరణించిన మాల మారెన్న కుటుంబాన్ని రోడ్డుపాలు చేసిన విద్యుత్ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మారెన్న అంత్యక్రియలు చేసి వస్తుండగా ఎస్సీ కాలనీలో ఉన్న మెయిన్ లైన్ వైర్ కింద పడి అక్కడే ఉన్న పోలీసులు అప్రమత్తం చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేసి ప్రాణనష్టం జరగకుండా కాపాడారని తెలిపారు. ఇలాంటి సంఘటనలు జిల్లాలోని చాలాచోట్ల జరుగుతున్నాయని, చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. మారెన్న కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. ఈనెల 26న కర్నూలు ఎస్‌సి కార్యాలయం ముందు ఆందోళన చేపడతున్నట్లు తెలిపారు. మాల మహానాడు యువజన సంఘం జిల్లా కన్వీనర్ భరత్, పెద్దహ్యాట వీరభద్ర, లింగంపల్లి మల్లికార్జున, ప్రకాష్ పాల్గొన్నారు.

విశ్వసనీయ సంస్థల్లో ఆర్‌డిటిఒ ఒకటి

నిరసన తెలియజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అత్యంత నమ్మకమైన సంస్థల్లో ఆర్‌డిటి ఒకటని నాయకులు తెలిపారు. బుధవారం పట్టణంలోని మల్లెల గ్రూప్స్, పూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, న్యూ లైఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ, జై భీమ్ ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు అధ్యక్షతన 'సేవ్ ఆర్‌డిటి' నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలంలో తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు, జై భీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల, జిల్లా కార్యదర్శి గర్జి హనుమన్న, పూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు సింగినేటి నరసన్న, వికలాంగుల హక్కుల రాష్ట్ర నాయకులు బీసీ.నాగరాజు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడి కేంద్ర హోం శాఖ పరిధిలో ఉన్న ఎఫ్‌సిఆర్ఎ నిబంధనల ప్రకారం ఆర్‌డిటికి అనుమతులు లభించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

- సెయింట్ జాన్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.శ్రీనివాసులు కోరారు. బుధవారం ఎమ్మిగనూరు మండలం ఎర్రకోట సెయింట్ జాన్స్ ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా 'స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్'లో భాగంగా కర్నూలు విశ్వభారతి బ్లడ్ బ్యాంక్ సహకారంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపు 82 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. వైస్ ప్రిన్సిపల్ వాగేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలి

- టిడిపి నాయకులు రఘునాథ్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

దేశంలో వంట నూనెలో కొరతను అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇస్తున్న వంద శాతం రాయితీతో ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని టిడిపి నాయకులు ఎన్.రఘునాథ్ రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని మాధవరం గ్రామం ఆయన స్వగృహంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తన సోదరులు, టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి చొరవతో ఆయిల్ పామ్ సాగుకు నియోజకవర్గంలోని నాలుగు మండలాలను ఎంపిక చేసినట్లు, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించి ఆయిల్‌పామ్ పంట విస్తీర్ణం పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందే ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు రాయితీపై మొక్కలు, ఎరువులు, డ్రిప్‌ను ప్రభుత్వమే అందిస్తోందని చెప్పారు. మొక్కలు నాటిన తర్వాత నాలుగో ఏడాది నుంచి కాపు మొదలై 30 ఏళ్లపాటు రైతులు ఏటా ఆదాయం పొందవచ్చని సూచించారు. ఎకరాకు సుమారు 10 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుండగా, ఏడాదికి ఎకరాకు సుమారు రూ.1.20 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు నికర ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. అధికారులు అపర్ణ, సుమంత్ పాల్, టిడిపి నాయకులు విజయ్, ఉరుకుంద, భీమారెడ్డి పాల్గొన్నారు.

IN THE COURT OF THE VIIth ADDL JUDGE: KURNOOL

EP NO:- 521/2024 in A. A NO:-389/2023

Between:

M/s Shriram Finance Ltd, Kurnool.
Represented by its Power of Attorney
Holder.Murali **...Claimant/Decree Holder**

V/s

1. M.V.Viswanath Reddy S/o Not known, aged about 30 years H.No.46-695-G2, Bhudawarapeta, Near Vijayadurga Hospital, Kurnool Town & Dist -518001.
2. T.Lokeswara Reddy S/o T.Lakshmi Reddy, aged about 32 years, H.No.1-153-2A, Godur Village & Mandal, Near Bustand, Kurnool Dist -518466. **...JDR'S**

1,2 వ ప్రతివాదులు

ORDER 21 RU 37.C.P.C NOTICE

పైన నెంబర్ అమలు అర్జీ (E.P.) లో వాది DHr. అయిన శ్రీరాం ట్రాన్స్ పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ వారు 1వ 2వ ప్రతివాదులైన (JDr1&2) మీ పైన అర్బిట్రేషన్ అవార్డును పొంది అవార్డు అమలు చేయమని కోరుతూ అమలు అర్జీ (E.P) దాఖలు చేసి ఉన్నారు. పై అమలు అర్జీ నందు కోర్టువారు మీకు మీరున్న అడ్రసుకు Order21, Rule37, C.P.C. నోటీసులు ఎన్నిసార్లు పంపించిన ఉద్దేశ పూర్వకంగా తీసుకొనకుండా త్రిప్పి వెనుకకు పంపుతూ ఉన్నారు. కావునా పై అమలు అర్జీ నందు మీకు ఏమైనా అక్షేపనలు వున్న ఎడల పై కోర్టు వారి యెదుట 25-09-2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు హాజరై మీ అక్షేపణలు తెలుపు కోవలెను. లేని యెడల పై అమలు అర్జీ మీ తెలియజేయడమైనది పరోక్షమందు తీర్మానించబడునని

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

తేది : 25-09-2025

P. RAMAKRISHNUDU
M.NARAYANA NAIK
DHR SAID ADVOCATE
KURNOOL

పేరు మార్పు ప్రకటన

డి.క్రిష్ణవేణి అలియాస్ కుంటలపాటి పద్మావతి కర్నూలు జిల్లా ఆదోని మండలం మదిరె గ్రామంకు చెందిన మధుసూదనరెడ్డి తో వివాహం అయింది. వివాహం కాక ముందు తీసుకున్న RPLI NO-R-AP-KR-EA-175825 లో D. క్రిష్ణవేణిగా వుంది. వివాహం తర్వాత నా పేరును కుంటలపాటి పద్మావతిగా మార్చుకున్నాను. ప్రభుత్వం జారీ- చేసిన ఆధార్ కార్డు 673403951525 లో కుంటలపాటి పద్మావతిగా పేర్కొన బడింది. కావున D.క్రిషవేణి, కుంటలపాటి పద్మావతి అను నేను ఒక్కటే అని దృవికరిస్తున్నాను.

ఇట్లు **కుంటలపాటి పద్మావతి**

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL DISTRICT JUDGE, KURNOOL AT: ADONI

I.A.NO. 145 OF 2025
IN
Original Suit No.2 OF 2016.

BETWEEN:
Sakarey Sai Prasad ... PLAINTIFF

A N D

Smt.S.Savitri Bai And others ... DEFENDANTS

D.26.Mr.Rajkumar, S/o. Ponde Pampanna, Age not known R/o. 4-192-30-1, Sakthi Gudi, Adoni. Kunrool District, AP-518301

The Plaintiff filed the above suit for Partition, Separate Possession in respect of Suit Schedule Properties against the Defendants which includes you. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above suit and the matter is posted to **15.10.2025** at **10.30** a.m. and therefore you may appear before this Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law. Hence, this Notice.

[BY ORDER OF THE COURT]

Sd/-
N. RAMACHENDRAIAH
Y. RAVI KIRAN
K. JAGADEESHWARA CHARY
Advocates
H. No. 5-2-392/P 155 SP, Gayathri Nagar Phase-4, Saheb Nagar Kalan, VanasthaliPuram, Hyderabad-70
Email :nramu18@gmail.com
Ph. No. 9440572244

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL DISTRICT JUDGE, KURNOOL AT: ADONI

I.A.NO. 146 OF 2025
IN
I.A.NO. 57 OF 2016
IN
Original Suit No.2 OF 2016.

BETWEEN:
Sakarey Sai Prasad ... PETITIONER/PLAINTIFF

AND

Smt.S.Savitri Bai And others ... RESPONDENTS/DEFENDANTS

D.26.Mr.Rajkumar, S/o. Ponde Pampanna, Age not known R/o. 4-192-30-1, Sakthi Gudi, Adoni. Kunrool District, AP-518301.

The Plaintiff had filed the above suit for Partition and Separate Possession against the Defendants which includes you with regard to the Suit Schedule Property. The Petitioners/Plaintiffs had also filed the above I.A. restrain the Respondents/ Defendants which includes you from alienating or otherwise encumbering the Petition Schedule Property. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above I.A. and the matter is posted to 15.10.2025 at 10.30 a.m. Therefore, you may appear before the Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law. Hence, this Notice.

[BY ORDER OF THE COURT]

Sd/-
N. RAMACHENDRAIAH
Y. RAVI KIRAN
K. JAGADEESHWARA CHARY
Advocates
H. No. 5-2-392/P 155 SP, Gayathri Nagar Phase-4, Saheb Nagar Kalan, VanasthaliPuram, Hyderabad-70
Email: nramu18@gmail.com
Ph. No. 9440572244